తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
30 ఏళ్ళ ప్రస్థానం వార్త 30 వార్షికోత్సవం 1996 - 2026

## శ్రీహరికోటలో జాతీయ భద్రత వారోత్సవాలు

సూళ్లూరుపేట, మార్చి 10 ప్రభాతవార్త



సతీష్‌థవన్ స్పేస్ సెంటర్ శ్రీహరి కోటలో జాతీయ భద్రత దినోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మార్చి 4 నుంచి 10వ తేదీ వరకు సేఫ్టీ, వెల్ బీయింగ్, క్రూషియల్ ఫర్ వికస్ భారత్ అనే నినాదంతో వారోత్సవాలు నిర్వహించారు. శ్రీహరికోటలోని బ్రహ్మప్రకాష్ హాలులో ముగింపు కార్యక్రమానికి షార్ డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చీఫ్ ఇండస్ట్రియల్ సేఫ్టీ డిఐఈ కల్పకం, రగోత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వివిధ క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

## పట్టాదారు పాసుపుస్తకాల్లో తప్పులు లేకుండా చూడండి

### జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రప్రసాద్



కార్వేటినగరం, మార్చి 10 ప్రభాతవార్త: రైతుల భూసమస్యల పరిష్కారం కోసం పట్టాదారు పాసుపుస్తకాల్లో తప్పులు లేకుండా చేయడమే స్పెషల్‌డ్రైవ్‌గా చేపట్టిందని జిల్లా జాయింట్‌కలెక్టర్ ఆదర్శ రాజేంద్రప్రసాద్ అన్నారు. కార్వేటినగరం తాహశీల్దార్ కార్యాలయంలో రెవిన్యూసిబ్బందితో సమీక్షించారు. విఆర్‌ఓలు, సర్వేయర్‌లు, క్షేత్రస్థాయిలో గ్రామాలకు వెళ్ళి పట్టాదారు పాసుపుస్తకాల్లో ఫోటోలు సరిగా కనబడక పోవడం, పూర్తిగా ఫోన్, ఆధార్‌నెంబర్లు సరిచేయడం తదితర వాటన్నింటిని గుర్తించి తాహశీల్దార్ లాగిన్‌లో సరిచేయాలన్నారు. ఆయన వెంట తాహశీల్దార్ కె. నాగరాజు, డిప్యూటీ తాహశీల్దార్ లోకేష్, రీ-సర్వే డిప్యూటీ తాహశీల్దార్ స్వరూపరాణి, సర్వేయర్ మార్కొండయ్య, ఆర్ఐ నరసింహులు, సర్వేయర్లు, విఆర్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి స్మార్ట్ సిటీ అభివృద్ధి పురోగతిపై

# కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

తిరుపతి కలెక్టరేట్, మార్చి 10 ప్రభాతవార్త:



తిరుపతి స్మార్ట్ సిటీ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ అధ్యక్షతన మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తిరుపతి స్మార్ట్ సిటీ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతి, అమలులో ఉన్న ప్రాజెక్టులు, చేపట్టాల్సిన తదుపరి కార్యక్రమాలపై ఈ సమావేశంలో సమగ్రంగా సమీక్షి ంచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్మార్ట్ సిటీ పరిధిలో చేపట్టిన అన్ని అభివృద్ధి పనులను వేగవంతంగా అమలు చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. నగరాభివృద్ధికి దోహదపడే మౌలిక సదుపాయాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రాజెక్టుల అమలు జరగాలని తెలిపారు. అదేవిధంగా స్మార్ట్ సిటీ కింద చేపడుతున్న పనుల నాణ్యతపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, పనులు పారదర్శకంగా , సమర్థవంతంగా అమలు కావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల పురోగతిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో తిరుపతి ఎస్.పి. ఎల్. సుబ్బారాయుడు, జాయింట్ కలెక్టర్ గోవిందరావు, మున్సిపల్ కమిషనర్ ఎన్. మౌర్య, స్మార్ట్ సిటీ అధికారులు , సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి నగరపాలకసంస్థ కార్యాలయంలో

# కొనసాగుతున్న ఏసిబి తనిఖీలు

### టౌన్‌ప్లానింగ్‌లో లోతుగా సోదాలు

### బిపిఎస్,ఎల్‌ఆర్‌ఎస్ రికార్డులు స్వాధీనం



తిరుపతి, మార్చి 10ప్రభాతవార్త: తిరుపతి నగరపాలకసంస్థ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఏసిబి అధికారులు తనిఖీలు చేశారు. మంగళవారం ఉదయం ఒక్కసారిగా ఏసిబి అదనపు ఎస్పీ విమలకుమారి నేతృత్వంలో సిబ్బంది కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ విభాగంపై సోదాలకు ఉపక్రమించారు. రాత్రి 10గంటల కూడా ఈ సోదాలు కొనసాగుతుండటం విశేషం. బహుళ అంతస్థుల భవనాలు క్రమబద్దీకరణ, భవనాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు, మార్పులకు వసూళ్ళు వంటివాటిపై ఏసిబి అధికారులు దృష్టి సారించారనేది తెలుస్తోంది. చిన్నపనికి కూడా మామూళ్ళు ఇవ్వందే పనులు జరగడంలేదనేది ఆరోపణలు. దీంతో టౌన్‌ప్లానింగ్‌లో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో రికార్డులు, సిబ్బంది నుండి వివరాలు రాబట్టారు. టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు ,సిబ్బంది వద్ద ఉన్న 30వేల రూపాయలు నగదును గుర్తించి ఏసిబి స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఉన్నఫళంగా ఒక్కసారిగా నగరపాలకసంస్థలో కౌన్సిల్ పదవీకాలం ముగిసే సమయంలో ఏసిబి దాడులు సంచలనం రేకెత్తాయి.

## హెచ్‌పివి వాక్సిన్‌తో గర్భకాన్సర్‌కు చెక్

### - డిఎంహెచ్‌ఓ డాక్టర్ సుధారాణి



బంగారుపాళ్యం, మార్చి 10 ప్రభాతవార్త: హ్యూమన్ పాపిలోమా వైరస్(హెచ్‌పివి) వాక్సిన్‌తో గర్భ కాన్సర్‌కు చెక్ పెట్టవచ్చునని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధారాణి అన్నారు. మంగళవారం తుంబకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఈ వాక్సిన్ పోస్టర్లను డిఎంహెచ్‌ఓ డాక్టర్ సుధారాణి ఆవిష్కరించి పిల్లలకు వాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఓ డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ ప్రభుత్వం యుక్త వయస్సు బాలికలకు గర్భకోశ గర్భ కాన్సర్ వ్యాధి నివారణలో భాగంగా ముందస్తుగా వాక్సిన్ అందిస్తోందన్నారు. 14 సంవత్సరాలు పైబడి 15 సంవత్సరాలు లోబడిన బాలికలకు ఈ వాక్సిన్‌ను ప్రభుత్వం ఉచితంగా వేస్తున్నదన్నారు. బహిరంగ మార్కెట్‌లో ఈ వాక్సిన్ ధర 9 వేల రూపాయలు వుండగా ప్రభుత్వం మంచి ఆరోగ్యం అందించాలనే లక్ష్యంతో ఉచితంగా వేస్తుందన్నారు. బంగారుపాళ్యం మండల పరిధిలో 500 మంది బాలికలను గుర్తించడం జరిగిందని, వారందరికీ ఈ వాక్సిన్ అందిస్తామని మండల వైద్యాధికారి డాక్టర్ లోహిత్ వివరించారు. ఈ వాక్సిన్ ద్వారా ఎలాంటి అపోహలు లేవని, సంపూర్ణ ఆరోగ్యవంతులుగా యువతులు తమ జీవితంను సాగించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ హనుమంతరావు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్, ఎంపిహెచ్‌ఓ రమేష్, సూపర్‌వైజర్లు రమాదేవి, అముద, హెల్త్ అసిస్టెంట్ శరత్, మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులు ఎన్‌పి ధరణి, జనార్ధన్‌గౌడ్‌లు, సింగిల్‌విండో ఛైర్మన్ హేమచంద్రనాయుడు, టిడిపి నాయకులు కోదండయాదవ్, హరిప్రసాద్, గిరిబాబు, రమేష్, కోకా ప్రకాష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కాణిపాకం దేవస్థానంలో

# ఆర్జెసీ విస్తృత తనిఖీలు



అన్నదాన భవన్‌లో ప్రసాదాల తయారీ, నాణ్యతను పరిశీలిస్తున్న తిరుపతి ఆర్జెసీ

కాణిపాకం, మార్చి 10 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో మంగళవారం దేవాదాయ, ధర్మాదాయశాఖ తిరుపతి రీజినల్ జాయింట్ కమీషనర్ చంద్రశేఖర్ ఆజాద్ విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. కాణిపాకం పర్యటనకు విచ్చేసిన ఈయన దేవస్థానంలోని పలు విభాగాల్లో తనిఖీలు నిర్వహించి భక్తులకు అందుతున్న వసతి సౌకర్యాల గురించి పరిశీలించారు. ఈమేరకు దేవస్థానం అధికారులతో కలసి అన్నదాన భవన్, లడ్డూపోటు, క్యూలైన్లు తదితర ప్రాంతాల్లో పరిశీలించారు. ఈమేరకు లడ్డూ పోటులో లడ్డూ ప్రసాదాల తయారీ విధానాన్ని, నాణ్యతను పరిశీలించి లడ్డూ నాణ్యతను మెరుగుపరచాలని సూచించారు. అలాగే దేవస్థానం అన్నదాన భవన్‌లో భక్తులకు అందిస్తున్న భోజనాలు, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఈసందర్భంగా భక్తులకు శుచి శుభ్రతతో కూడిన నాణ్యమైన భోజనాన్ని అందించాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. అలాగే ఆర్జెసీ చంద్రశేఖర్ ఆజాద్ స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అలాగే దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఈ వెంకట నారాయణ, ఏఈఓలు రవీంద్రబాబు, ప్రసాద్, హరిమాధవరెడ్డి, ధనుంజయ, ఎస్వీ. కృష్ణారెడ్డి, సూపరెండెంట్‌లు వాసు, కోదండపాణి, బాల రంగస్వామిలతో పాటు ఆలయ అధికారులు పాల్గొనా న్నరు.

## గంజాయి పట్టివేత - నలుగురి అరెస్టు



వడమాలపేట, మార్చి 10 ప్రభాతవార్త: వడమాలపేట బైపాస్ రోడ్డులో 20 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేసినట్లు పుత్తూరు డీఎస్పీ రవికుమార్ తెలిపారు. మంగళవారం వడమాలపేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫ్లైయింగ్ స్క్వాడ్, ఇతర సిబ్బంది కలసి సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వడమాలపేట బైపాస్ రోడ్డులో టీటీడీ స్థలాల సమీపంలో మంగళవారం సాయంత్రం మోటారు సైకిల్, స్కూటీలను తనిఖీ చేస్తుండగా గంజాయి దొరికినట్లు తెలిపారు. కృష్ణా జిల్లా బాపుల పాడు మండలం హనుమాన్ జంక్షన్‌కు చెందిన గారం భవాని(42), నందిగామపాళెం గ్రామానికి చెందిన చెట్టి కృష్ణారావు(42), చిత్తూరు జిల్లా నగరి మండలం ఓజీ కుప్పం గ్రామానికి చెందిన గోగుల సాంసన్ అనే రాజు(33), జి. ఊర్మిళ(26)లను అదుపులోకి తీసుకుని వారి వారి వద్ద ఉన్న 10 బండిల్స్‌లో ప్రతి బండిల్లో 2 కేజీలు చొప్పున మొత్తం 20 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో సీఐ రవీంద్ర, ఎస్ఐ హరీష్, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రౌండ్ వాటర్ ఐడెంటిఫికేషన్ కోసం బోర్వెల్

తిరుపతి విద్య మార్చి 10 ప్రభాతవార్త.



విద్యార్థులకు ఫీల్డ్ నాలెడ్జ్, పరిశోధలపై అవగాహన సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు, ఎస్వీయూ జియాలజీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఎస్వీయూలో కేంద్ర జియాలజిస్ట్ బృందం జియో ఫిజికల్ సర్వేలో భాగంగా గతంలో యాక్యుఫర్ మ్యాపింగ్ సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా వర్సిటీలోని నేచురల్ సైన్స్ భవనం సమీపంలో 650 అడుగుల మేర బోర్వెల్ వేయాలని నిర్ణయించింది. వర్సిటీ అధికారుల సహకారంతో మంగళవారం సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు బృందం సర్వే నిర్వహించిన ప్రాంతంలో బోర్ వేశారు. బోర్వెల్ వేస్తున్న సమయంలో ప్రతి 15 అడుగులకు సాయిల్ మార్పు, నీటిలభ్యత శాతం, రాక్ ఫార్మేషన్ గమనించి శ్యాంపిల్స్ను సేకరించారు. పలు రకాల సాయిల్స్ను గుర్తించి సేకరించిన శ్యాంపిల్స్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బోర్వెల్ వేస్తున్న ప్రాంతాన్ని వీసీ టాటా నర్సింగరావు, రెక్టార్ అప్పారావు సందర్శించి వర్సిటీలో నీటి లభ్యత, సాయిల్స్ రకాలపై జియాలజీ విభాగపు అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లడుతూ జియో ఫిజికల్ సర్వేలో భాగంగా వర్సిటీలో సెంట్రల్ వాటర్ బోర్డు బోర్వెల్ను వేయడం జరిగిందన్నారు. గ్రౌండ్ వాటర్ ఐడెంటిఫికేషన్, భూమిలోని సాయిల్స్ రకాలు, రాక్ ఫార్మేషన్పై, నీటి అవశేషాలపై జియాలజీ విభాగం విద్యార్థులకు అవగాహన కలగడంతో పాటు వాటిపై పరిశోధనలకు చేసేందుకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. జియాలజీ హెడ్ ప్రొఫెసర్ మధు, ప్రొఫెసర్ సురేష్, ప్రొఫెసర్ గోపినాయక్, డాక్టర్ బలరామ్, డాక్టర్ శంకర్, డాక్టర్ సుబ్బారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## అడవులకు నిప్పు పెడితే కఠిన చర్యలు: రేంజ్ అధికారి పి.ధీరజ్



చిట్వేలి, మార్చి 10,ప్రభాతవార్త: ముఖ్యంగా ఎండాకాలంలో పశువుల మేత కోసం కొత్త గడ్డి వస్తుందని అవగాహన రాహిత్యం వల్ల అనేక జీవరాశులకు నిలయమైన అడవులకు నిప్పు వేయడం చట్టరీత్యా నేరమని, అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చిట్వేలి రేంజ్ ఆఫీసర్ పి. ధీరజ్ అన్నారు. మంగళవారం తాను మాట్లాడుతూ సుమారు 1000 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో సుదూరంగా వ్యాపించి నల్లమల, శేషాచలం కొండల కలయికతో ఆధ్యాత్మిక, పర్యాటక శోభను సంతరించుకున్న శ్రీ పెనుశిల అభయారణ్యం నందు పెద్దపులి చిరుత పులులు, జింకలు, కనుతులు, దుప్పిలు కొండ గొర్రెలు, అడవి పందులు, నెమలలు, ఎలుగు బంట్లు అనేక పశుపక్షాదులు విరివిగా ఉన్నాయన్నారు. ఔషధ మూలికలతో పాటు, వెదురు, విలువైన ఎర్రచందనం మనకు మాత్రమే సొంతమన్నారు. ఇట్టి విశిష్టతగల అడవుల పట్ల కొందరు అకతాయిలు అజ్ఞానంతో వ్యవహరిస్తున్న తీరు.. అడవులను, అందులోని విలువైన వృక్షాలను, జంతువులను దహించి వేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అటవీశాఖ సిబ్బందితో అందుబాటులో ఉన్న సాంకేతికతో అడవులలో కెమెరాలు అమర్చామని, ఎవరికి అడవులలోకి వెళ్ళేందుకు అనుమతులు లేవని, ఎవరైనా వెళ్ళినట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### క్రూర జంతువులు గ్రామాల్లోకి వస్తాయి...

జంతువులకు నివాసంగా ఉన్న అడవులను కాల్చడం వల్ల క్రూర జంతువులు భయానికి లోనై,



సమీప గ్రామాల్లోకి వచ్చే ప్రమాదం ఉందని రేంజ్ అధికారి ధీరజ్ అన్నారు. అగ్ని వ్యాపించకుండా అడవులలో ట్రెంచ్ లు ఏర్పాటు చేశామన్నారు. మా సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహిస్తున్నారని, ఎండాకాలంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అటవీ సంపదను రక్షించుకునే క్రమంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, అడవులను నష్టపరిచే వారి సమాచారాన్ని తమకు అందివ్వాలని అధికారి పి. ధీరజ్ ప్రభాతవార్త ద్వారా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా శ్రీదండుమారెమ్మ రథోత్సవం



కుప్పం, మారి ్చ 10 ప్రభాతవార్త మున్సిపల్ పరిధి కమతమూరులో వెలసిన శ్రీ ప్రసన్న దండుమారెమ్మ జాతర ఘనంగా జరుగుతోంది. అమ్మవారి జాతరలో భాగంగా మంగళవారం అమ్మవారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పుర వీధుల్లో రథాన్ని ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్‌గా కలెక్టర్ సుమిత్ కుమార్



చిత్తూరు, మార్చి 10 ప్రభాతవార్త చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్ గా కలెక్టర్ సుమిత్ కుమార్ ను ప్రభుత్వం నియమించింది. మున్సిపల్ పాలకవర్గాలకు ఈనెల 17వ తేదీన గడువు ముగియనుంది. మున్సిపాలిటీలకు ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే అవకాశం లేకపోవడంతో ప్రభుత్వం స్పెషల్ ఆఫీసర్లను నియమించింది ఈ మేరకు చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ స్పెషల్ ఆఫీసర్ గా కలెక్టర్ సుమిత్ కుమార్ నియమితులయ్యారు. మున్సిపల్ పాలకవర్గాలకు గడువు ముగిసిన వెంటనే కలెక్టర్ సుమిత్ కుమార్ చిత్తూరుమున్సిపల్ కార్పొరేషన్ స్పెషల్‌ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు.

## ముగిసిన నగరపాలక కౌన్సిల్ పదవీకాలం

### -జిల్లా కలెక్టర్ ప్రత్యేక అధికారి



తిరుపతి, మార్చి 10ప్రభాతవార్త: రాష్ట్రంలో నగరపాలక, పురపాలక సంఘాలకు ప్రత్యేక అధికారుల నియామకం చేస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. తిరుపతి నగరపాలక కౌన్సిల్ పదవీకాలం ముగియడంతో ఆ స్థానంలో జిల్లా కలెక్టర్ సలిజామాల వెంకటేశ్వర్ ప్రత్యేక అధికారిగా వ్యవహరించనున్నారు. ప్రత్యేక అధికారులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేయడంతో కలెక్టర్ స్పెషల్ ఆఫీసర్లుగా నియమించింది. ఆరు నెలల పాటు కలెక్టర్లు స్పెషల్ ఆఫీసర్లుగా కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొంది.

## నేడు శృంగేరి భవనం ప్రారంభం: శివయ్య దర్శనం



శ్రీకాళహస్తి, మార్చి 10 ప్రభాతవార్త దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తికి మంగళవారం రాత్రి శృంగేరిలోని శారద పీఠాధిపతి అనంతశ్రీ జగద్గురు శంకరాచార్య భారతీ తీర్థ మహాస్వామి వారి అనుగ్రహంతో తత్కరకమల సంజాత అనంతశ్రీ విభూషిత జగద్గురు విధుశేఖర భారతి మహాస్వామి వచ్చారు. వారికి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుదీర్‌రెడ్డి దంపతుల పర్యవేక్షణలో ఘనస్వాగతం ఏర్పాటుచేసారు., స్వామి రాక కోస ఆలయ ఇఓ బికె వెంకటేశు సారధ్యంలో జలవినాయక ఆలయం వద్ద భారీ ఏర్పాట్లు చేసారు. ఆలయ అధికారులు, సిబ్బంది ధర్మకర్తల మండలి ఛైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ వారి సహచరుల సారధ్యంలో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. స్వామి వారికోసం సాయంత్రం 5గంటలనుంచి జలవినాయక ఆలయం వద్ద ఆలయఅధికారులు, వేదపండితులు, అర్చకులు నిరీక్షించారు. స్వామి శ్రీశైలం నుంచి బయలుదేరి వచ్చారు. రాత్రి శివయ్య సన్నిధి మూసే వరకు రాకపోవటంతో బుధవారం ఉదయం నుంచి కార్యక్రమాలను ఏర్పాటు చేసారు.

### ఆలయం సారధ్యంలో విస్తృత ఏర్పాట్లు



నూతన భవనం ప్రారంభం:

ఎఅయితే ఇక్కడి శుకబ్రహ్మాశ్రమంకుస మీపంలో హరిశంకర అవధాని (టిటిడి రిటైర్డ్ వేదపండితులు) ప్రత్యేకంగా స్థలాన్ని కొనుగోలు చేసారు. ఇక్కడ ప్రత్యేక భవనం నిర్మించారు. ఈ భవనాన్ని పీఠాధిపతి పర్యటన సందర్భంగా ప్రారంభించనున్నారు. ఇక్కడ భవిష్యత్తులో ధార్మిక కార్యక్రమాలు నిర్వహించుటకు ఉపయోగించ నున్నారు. ఈ నేపధ్యంలో కార్యక్రమాలను ఖరారు చేసారు. భవిష్యత్తులో ఈ భవనం ద్వారా శృంగేరి పీఠం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిసింది. ఇందులో వేదపాఠశాల, అమ్మవారి విగ్రహం, బ్రాహ్మణులకు భోజనవసతి కల్పించుటకు ప్రణాళికలు సిద్దం చేసారు.

స్వామి పర్యటన ఇలా . . .

శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో శృంగేరి శారదా పీఠాధిపతి విధుశేఖర భారతీ మహాస్వామి పర్యటన ఇలా సాగనుంది. ఉదయం 9.30 గంటలకు పాల్గొంటారు. మూడవ కాలాభిషేకంలో పాల్గొంటారు.. తదనంతరం దేవస్థానంకు అనుబంధంగా ఉన్న భరద్వాజ తీర్థంలోని గంగా సదన్‌లో జగద్గురు జరుపుకునే చంద్ర మౌళీశ్వరపూజలు మార్చి 11 బుధవారం ఉదయం 10గంటలకు శ్రీజ్ఞాన ప్రసూనాంబసమేత శ్రీకాళహస్తీశ్వరుని దర్శనం, విశేష అభిషేకాలు, అర్చనలు నిర్వహించనున్నారు. ఇక సంప్రదాయం బద్దంగా స్వామి వారికి మొదటిగేటు భిక్షాల గాలిగోపురం నుంచి స్వాగత సన్నాహాలు చేస్తున్నారు. 11గంటలకు గంగా సదన్‌లో జగద్గురు వందన సభ అనుగ్రహ భాషణం, భక్తులకు దర్శనం, పాదపూజలు, మధ్యాహ్నం 12.30గంటల నఉంచి భక్తులకు భోజన ప్రసాదాలు, సాయంత్రం 5గంటలకు తిరుపతి పయనం ఏర్పాటు చేసినట్లు అధికారికంగా ప్రకటించారు.

## టీచర్ల సమస్యలకు సత్వరం పరిష్కారం

### - డిఇఓ రాజేంద్రప్రసాద్‌కు యుటిఎఫ్ నాయకులు వినతి

చిత్తూరు, మార్చి 10 ప్రభాతవార్త: జిల్లా విద్యాశాఖ పరిధిలో వున్న ఉపాధ్యాయ సమస్యలను సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి జివి రమణ ఆధ్వర్యంలో మంగళవారం యుటిఎఫ్ నాయకులు జిల్లా విద్యాశాఖ అధికారి రాజేంద్రప్రసాద్‌ను కలిసి విన్నవించారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డిఇఓను మంగళవారం యుటిఎఫ్ నాయకులు కలిసి మాట్లాడుతూ 2008 డిఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు సీనియార్టీ సరవిస్తూ గతంలో ఉత్తర్వులు జారీ చేశారని, ఈ పరిస్థితుల్లో డిఎస్సీ 2008 ద్వారా నియామకం కాబడిన టీచర్లకు వార్షిక ఇంక్రిమెంట్ తేదీని జూన్‌లో మంజూరు చేసే విధంగా సవరణ ఉత్తర్వులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

## పిహెచ్‌సి సందర్శించిన ప్రభుత్వవిప్



**రామకుప్పం, మార్చి 10 ప్రభాతవార్త** మండలంలోని విజలాపురం పిహెచ్‌సిని మంగళవారం ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ సందర్శించారు. ఈసందర్భంగా 14 ఏళ్ల బాలికలకు హెచ్‌పివి టీకా కార్యక్రమంను ఆయన ప్రారంభించారు.బాలికల్లో కేన్సర్ రాకుండా ఉండేందుకు ఈ టీకాలను ఉచితంగా ప్రభుత్వాలు వేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టిటిడి డైరెక్టర్ వైద్యం శాంతారాం, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మునస్వామి, నేతలు వెంకటరమణ, ఆనందరెడ్డి, పత్ర నారాయణ, బాబు, గుర్రప్ప, వెంకటరామగౌడు, రామూర్తి, రఘు, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కామరాజునాయక్, షణ్ముగం, వైద్యాధికారి పూజిత, సాయిశ్రీ, హెచ్ఎ బాలు, ప్రమీల, సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

శాంతిపురం, మార్చి 10 ప్రభాతవార్త



మండలంలోని కర్లగట్ట పంచాయతీ వెంకటాపురంలో రైతుల సౌకర్యార్థం నూతనంగా 65కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను రెస్కో డైరెక్టర్లు అనసూయ, బసవ రాజు, చలపతి ప్రారంభించారు. దీంతో రైతులు హర్షంవ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎఇ మునిరత్నం, లైన్‌మెన్ వెంకటేష్, బెనర్జీ, రైతులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి



**శాంతిపురం, మార్చి 10 ప్రభాతవార్త** అతిత్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ కోరారు. మంగళవారం మత ం, కెనమాకులపల్లి పంచాయతీ సమన్వయ కమిటీ సమావేశాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా నేతలు చూడాలన్నారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేచే రంజాన్‌తోఫా పంపిణీ



**పలమనేరు. మార్చి 10, ప్రభాతవార్త:** పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సుమారు రూ.500 పైగా విలువచేసే సరుకులు రంజాన్‌తోఫా పేరుతో ఒక్కో కుటుంబాలని అందజేశారు. చక్కెర,సేమియా, నెయ్యి, గోధుమపిండి, వంటనూనె తదితర సరుకులు ఉన్న బ్యాగులు అందజేశారు. పలమనేరులో సుమారు 5 వేల ముస్లిం కుటుంబాలు ఉండగా వీరిలో ఆర్థికంగా వెనుక బడిన కుటుంబాలు దాదాపు 75 శాతం ఉన్నాయి. మున్సిపల్ కమీషనర్ ఎంవి, రమణారెడ్డి, సూపర్‌బజార్ అధ్యక్షుడు ఆర్‌వి బాలాజీ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## 14ఏళ్లబాలికలకు హెచ్‌పివి వాక్సిన్ వేయించాలి

పెద్దపంజాణి, మార్చి 7 ప్రభాతవార్త : మండలంలో ఉన్న 14ఏళ్ల బాలికలకు



హెచ్‌పివి వాక్సిను తప్పకవేయించాలని పెద్దపంజాణి వైద్యాధికారి డా॥మురళి కోరారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు బాలికల్లో గర్భా శయ ముఖద్వారా క్యానర్ రాకుండా ఉండేందుకు ఈటీకాలను ఉచితంగా వేస్తున్నట్లు తెలిపారు. ఈటీకా వేసుకున్నాక కొంతమందికి తేలికపాటి జ్వరం,వొంటినొప్పులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ లక్షణాలు రెండుమూడు రోజుల్లో తగ్గిపోతాయన్నారు. టీకాలు వేయించుకున్న బాలికలకు సర్టిఫికెట్ సైతం కేంద్రప్రభుత్వం అందిస్తుందన్నారు.మండలంలో ఉన్న 14ఏళ్లలోపు బాలికలు ఈఅవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని,తల్లిదండ్రులుకూడా తమబాలికలకు తప్పక టీకాలు వేయించాలని ఆయన కోరారు.

## శ్రీకాళహస్తిలో సావిత్రి బాయి పూలే వర్ధంతి



**శ్రీకాళహస్తి, మార్చి 10 ప్రభాతవార్త** శ్రీకాళహస్తిలో సావిత్రి బాయిపూలే వర్ధంతిని బిసి వర్గాలు మంగళవారం జరుపుకున్నాయి. ఈ నేపథ్యంలో బిసి నాయకులు డాక్టర్ జి.ధశరధాచ్చారి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ మిన్నల్ రవి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఉమేష్‌రావుల సారధ్యంలో కార్యక్రమాలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో యం.సుబ్బయ్య, వజ్రం కిషోర్,కోట చంద్రశేఖర్, మహబూబ్‌బాషా, వెంకటరమణ, చల్లకూరు మణి, సయ్యద్ చాంద్‌బాషా, గాజుల భగత్, సొంపల్లి మురళి నాయుడు, హరి,సయ్యద్ అహమ్మద్, సులేమాన్,మహమ్మద్ రఫీ,ఆనంద్, నూర్ మహమ్మద్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఎంఎల్‌ఏను కలసిన ఇఓ



**శ్రీకాళహస్తిరూరల్, మార్చి 10 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయ కార్యనిర్వహణాధికారిగా బాధ్యతలు స్వీకరించిన బికె వెంకటేశు సోమవారం శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామంలో శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డిని కలసి స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు. స్వామి అమ్మవార్ల ఆశీర్వద దుశ్శాలువతతో సత్కరించారు.ఈ సందర్బంగా ఇఒ వెంకటేశుతో ఎంఎల్‌ఏ మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో శ్రీకాళహస్తీశ్వరాలయం కీలకమన్నారు. ఇక్కడకు నిత్యం వేలాది మంది భక్తులు,విఐపిలు వస్తుంటారన్నారు.కాబట్టి పరిపాలనలో జవాబుదారి తనం ఎంతో ముఖ్యమన్నారు. వచ్చిన ప్రతి భక్తుడు మళ్ళీ మళ్ళీ రావాలనే రీతిలో భక్తులను భగవంతులుగా పరిగణించి సేవలందించాలన్నారు.

# రైల్వే కోడూరు డివిజన్

## ఒత్తిడిని జయించి పరీక్షలు రాయాలి



**పెనగలూరు, మార్చి 10 ప్రభాతవార్త** రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలంలో ఉన్నటువంటి నల్లపురెడ్డి పల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాసే సమయంలో ఒత్తిడితో కాకుండా ప్రశాంతమైన మనసుతో పరీక్షలు రాస్తే మంచి మార్కులు సాధిస్తారని తాసిల్దారు అమరేశ్వరి అన్నారు. మంగళవారం నల్లపురెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో హెడ్మాస్టర్ అధ్యక్షతన జరిగిన 10వ తరగతి విద్యార్థుల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జీవితంలో ఉన్నత చదువులు చదవాలన్న ఉన్నతమైన ఉద్యోగాలు చేసుకోవాలన్న 10వ తరగతిలో సాధించిన మంచి మార్కులే కీలక మన్నారు. సమావేశంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామ్మోహన్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి: సిపిఐ



**పెనగలూరు, మార్చి 10 ప్రభాతవార్త** రైల్వేకోడూరు నియోజకవర్గం పెనగలూరు మండలం పేదవారి నడ్డి విరిస్తున్న గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ మండల పార్టీ కార్యదర్శి గానిగిపెంట ఆదినారాయణ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమానికి భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రైల్వే కోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య హాజరై ఆయన మాట్లాడుతూ మహిళపై భారం మోపెందుకే గ్యాస్ ధరలను అమాంతంగా పెంచారన్నారు. ఆంధ్రలో గ్యాస్ నిక్షేపాలు సమృద్ధిగా ఉన్న ధరలు పెంచి ఆదానీ అంబానీలకు కార్పొరేటర్ వ్యక్తులకు లాభం చేకూర్చే విధంగా వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ దాడి రష్యా నుండి ఆయిల్ కొనుగోలుపై ఆంక్షలు నేపథ్యంలో ఈ ధరల పెంపుదల ప్రజలపై సరఘతంగా మారిందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ సహాయ కార్యదర్శి ఈరి లక్ష్మీనారాయణ. కార్యవర్గ సభ్యులు రేవూరి శంకరయ్య ఎస్ ఓబులేసు పందికాళ్ళ శివశంకర్. ప్రజలు పాల్గొన్నారు.

## చెక్కభజన గురువుకు మదర్ థెరిసా జాతీయ సర్వీస్ అవార్డు



**పెనగలూరు, మార్చి 10 ప్రభాతవార్త** పెనగలూరు మండలం నల్లపురెడ్డిపల్లి అరుంధతి వాడకు చెందిన ఓబిలి వెంకటసుబ్బయ్య అనే గురువుకు మదర్ థెరిసా జాతీయ సర్వీస్ అవార్డు లభించినట్లు ఆయన తెలిపారు. సోమవారం మార్కాపురం పట్టణంలోని గొల్ల సత్యనారాయణ కళ్యాణ మండపంలో మదర్ తెరిసా జాతీయ సర్వీస్ గ్లోబల్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సిఎస్సి కోర్టు సీనియర్ సూపర్ ఇండెంట్ సివి సి అంజనీ కుమారి చేతుల మీదుగా ఈ అవార్డు ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ అవార్డు పట్ల తన భజన గురువు ఓబులేసు అడుగుజాడల్లో నడుస్తూ ఆయన పేరుకు కీర్తి ప్రతిష్టలు తీసుకొస్తానని ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య తెలిపారు. వెంకటసుబ్బయ్యకు మదర్ తెరిసా అవార్డు రావడం పట్ల కుటుంబ సభ్యులు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## బాలికలకు హెచ్‌పివి వాక్సిన్ తప్పనిసరి

**గుడిపాల, మార్చి 10 ప్రభాతవార్త:**14 సంవత్సరాలు పూర్తయిన బాలికలకు హెచ్‌పివి వాక్సిన్ తప్పనిసరిగా వేయించేలా తల్లిదండ్రులు చొరవ చూపాలని ఎంపిపి హరిప్రసాద్ చౌదరి పేర్కొన్నారు. గుడిపాల పిహెచ్‌సిలో మంగళవారం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంధ్య ఆధ్వర్యంలో ఎంపిపి హరిప్రసాద్ చౌదరి 14 సంవత్సరాలు నిండిన 17 మంది బాలికలకు హెచ్‌పివి వాక్సిన్ అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఈ వాక్సిన్ తీసుకోవడం వల్ల భవిష్యత్తులో ఆడపిల్లలకు కాన్సర్ నిరోధక వాక్సిన్‌గా పని చేస్తుందనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పిహెచ్‌సిల్లో వాక్సిన్ అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. గుడిపాల పిహెచ్‌సిని 30 పడకల ఆసుపత్రిగా మార్పు చేయడానికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు కృషి చేస్తున్నారన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంధ్య, మహిళా సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు జీవన్, సింగిల్‌విండో ఛైర్మన్ ప్రతాప్‌నాయుడు, డాక్టర్ చంద్రమహేష్, సిబ్బంది సూర్యనారాయణ, విజయ, చంద్రశేఖర్, ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం రెస్కోలో వన్‌టైం సెటిల్‌మెంట్



**కుప్పం, మార్చి 10 ప్రభాతవార్త** కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (రెస్కో) పరిధిలో పాత బకాయిల వసూళ్లకై సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో వినియోగదారుల సౌకర్యార్థం వన్‌టై ం సెటిల్‌మెంట్ (ఒటిఎస్)ను అమలు చేస్తున్నట్లు రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్ తెలిపారు. ఈమేరకు పాలకవర్గం సైతం ఆమోదించామన్నారు. జనవరి 31,2026వరకు ఉన్న విద్యుత్ బకాయిలకు సంబంధించి వినియోగదారులు బకాయిల మొత్తం చెల్లిస్తే వాటిపై ఉన్న సర్‌చార్జ్ (వడ్డీ)మాఫీ చేయడం జరుగుతు ందన్నారు. ఈనెల 25వతేది వరకు ఈ వన్‌టై ంసెటిల్‌మెంట్ పథకంను అమలు చేయనున్నట్లు తెలిపారు. రెస్కో మేనేజింగ్ డైరెక్టర్ సోమశేఖర్, రెస్కో డైరెక్టర్లు పాల్గొన్నారు.

## వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలి : ఎంపిపి



**కుప్పం, మార్చి 10 ప్రభాతవార్త** వేసవి దృష్ట్యా గ్రామాల్లో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు సమన్వయంతో పని చేయాలని ఎంపిపి అశ్విని మురుగేష్ సూచించారు. మంగళవారం మండల కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈస ందర్భంగా ఆమె మాట్లాడుతూ మంచినీటి సమస్య తలెత్తితే కడ, మండల పరిషత్, జడ్పీనిధులతో సమస్య పరిష్కరించేందుకు అవకాశం ఉందన్నారు. కుప్పం ప్రాంతంలో ఏనుగుల దాడుల నిరోధానికి అటవీ అధికారులు తగు చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే ఈసారి పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు వచ్చేందుకు విద్యాశాఖ కృషి చేయాలన్నారు. విద్యుత్ కోతలు అధికమయ్యాయని రెస్కో అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలన్నారు.జడ్పీటిసి ఎడిఎస్ శరవణ మాట్లాడుతూ మండలంలో రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలన్నారు. కాగా బిడిచేన్లు, గరిగచీనేపల్లి వద్ద విద్యుత్ లైన్లు మార్చాలని సర ్పంచులు కోరారు సమావేశంలో ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు,పిఎసిఎస్ ఛైర్మన్ కృష్ణమూర్తి, వైస్ ఎంపిపి సుశీల, ఎంపిడిఒ వెంకటేశ్వర్లు, కో ఆప్షన్ అతహర్, ఎంపిటిసిలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సర్పంచులకు ఘన సన్మానం



**కుప్పం, మార్చి 10 ప్రభాతవార్త** కుప్పం మండలంలో ఉన్న పంచాయతీ సర్పంచులను మంగళవారం కుప్పం మండల కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఏప్రిల్ 2కు సర్పంచుల పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో సర్పంచులను సత్కరించారు. ఎంపిపి అశ్విని మాట్లాడుతూ ఐదేళ్ల కాలంలో మండలంలోని సర్పంచులు తమ విధులను బాగా నిర్వహించారని వారి సేవలు మరువలేనివని పేర్కొన్నారు. కార్యక్రమంలోజడ్పీటిసి ఎడిఎస్ శరవణ, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు,పిఎసిఎస్ ఛైర్మన్ కృష్ణమూర్తి, వైస్‌ఎంపిపి సుశీల, ఎంపిడిఒ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ ఉబ్బమ్మ దేవర



కుప్పం, మార్చి 10 ప్రభాతవార్త

స్థానిక పాతపేట దోబీఘాట్ వద్ద వెలసిన శ్రీ ప్రసన్న ఉబ్బ గంగమ్మ ఆలయం వద్ద ఉబ్బమ్మ దేవరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గంగపూజ, ఉబ్బదేవర పూజ చేపట్టారు. అనంతరం మహిళలు అమ్మవారికి పెద్ద ఎత్తున పొంగళ్లు సమర్పించారు.అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం జరిపారు. అమ్మవారి ఉత్సవంను ఘనంగా ఊరేగించారు. అమ్మవారిని ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, కడ పి.డి. వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్, స్థానిక నేతలు దర్శించుకున్నారు.

## హెచ్‌పివి టీకాతో బాలికలకు ఆరోగ్య భద్రత

**కుప్పం, మార్చి 10 ప్రభాతవార్త** బాలికల్లో కేన్సర్ వ్యాధి నిరోధానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా అందిస్తున్న హెచ్‌పివి టీకాలతో బాలికలకు ఆరోగ్య భ ద్రత లభిస్తుందని ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. స్థానిక కొత్తపేటలోని హెల్త్ సెంటర్‌లో వారు టీకాల కార్యక్రమంను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు చేపట్టిన సంజీవని ప్రాజెక్టులో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. బాలికల ఆరోగ్యంకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటోందన్నారు. తల్లిదండ్రులు కూడా బాలికలకు హెచ్‌పివి టీకాలు తప్పక వేయించాలని సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ కన్నన్, యూనిట్ ఇన్‌చార్జ్ అప్పు, కార్పొరేషన్‌డైరెక్టర్‌వేణుగోపాల్, నేతలు డాక్టర్ వెంకటేష్, ఉదయ్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు ప్రజలకు వివరించాలి



**కుప్పం, మార్చి 10 ప్రభాతవార్త**

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో అర్హులైన అందరికీ సంక్షేమ పథకాల్లో లబ్ది కలుగుతుందని టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ పేర్కొన్నారు. గరిగచీనేపల్లి పంచాయతీలో జరిగిన కెఎస్ఎస్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు హైదర్‌వలీ, కనకరాజు, చ ంద్రయ్య, శివ, నరసింహులు పాల్గొన్నారు.

## విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు, మోటార్ వైర్లు చోరీ

**ఓబులవారిపల్లి, మార్చి 10 ప్రభాతవార్త** రైల్వే



కోడూరు నియోజకవర్గంలో అడ్డు అదుపు లేకుండా విచ్చలవిడిగా విద్యుత్ మోటార్ వైర్లు, ట్రాన్స్ఫార్మర్లను పగులగొట్టి అందులో ఉన్న విలువైన రాగి వైరును గుర్తు తెలియని దొంగలు చోరీలకు పాల్పడు తున్నారని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. ఓబులవారిపల్లి పుల్లంపేట. పెనగలూరు రైల్వే కోడూరు చిట్వేలు మండలాల్లో కూడా విద్యుత్ వైర్లు చోరీలు చేస్తూ రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లింగిరెడ్డిపల్లి పెద్దవరంపాడు పంచాయతీలలో ఒక రైతుకు సంబంధించిన మామిడి తోపులో విద్యుత్ మోటార్లు అపహరించి ఆ రైతుకు తీరని దుఃఖాన్ని మిగిల్చారని అలాగే లక్షలాది రూపాయలు నష్టం వాటిలినట్టు. సంబంధింత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత పోలీసు ఉన్నతాధికారులు చోరీలు జరగకుండా చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ రైతులు కోరుతున్నారు.

## ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముక్కా సాయి వికాస్‌రెడ్డి



**ఓబులవారిపల్లి, మార్చి 10 ప్రభాతవార్త** రైల్వే కోడ్ నియోజకవర్గంలో ముస్లిం సోదరులు ఆహ్వానం మేరకు పట్టణంలో ఉన్న యువత ఆహ్వానం మేరకు కూడా చైర్మన్ టిడిపి ఇన్చార్జ్ ముక్కా రుపానంద రెడ్డి తనయుడు టిడిపి యువ నాయకుడు ముక్క సాయి వికాస్ రెడ్డి యూత్ తార్ విందులో పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ముందస్తుగా అన్ని విధాల ఆ భగవంతుడు అందరికీ మంచి జరగాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు, యువ నాయకులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో జాతర సంబరాలు

తొట్టంబేడు,మార్చి 10 ప్రభాతవార్త

తొట్టంబేడు మండలంలోని గ్రామాల్లో వేసవి సందర్భంగా జాతర సంబరాలు మొదలయ్యాయి. శ్రీకాళహస్తికి సమీపంలోని జ్ఞానమ్మకండ్రిగ, కొత్త కండ్రిగ గ్రామాల్లో మంగళవారం జాతర మొదలైంది. మంగళవారం ఉదయం నుంచి గ్రామ దేవత ఆలయం వద్ద పొంగళ్ళను పెట్టారు. మహిళలు విశేష సంఖ్యలో హాజరై అమ్మవారికి పాల పొంగళ్ళను సమర్పించారు. ఉదయం నుంచి మహిళలు పొంగళ్ళలో నిమగ్నం కాగా మధ్యాహ్నం నుంచి యువకులు అమ్మవారి విగ్రహం ఊరేగింపుల్లో ఉత్సాహంగా ఏర్పాట్లు చేపట్టారు. ఇక్కడ అమ్మవార్లకు ప్రత్యేకాలంకారానికి సిద్ధం చేసారు.

## మహిళా ఉపాధ్యాయులకు సన్మానం



**శ్రీకాళహస్తిరూరల్,మార్చి 10 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి మండలంలోని బివి పురం లో సోమవారం మహిళా ఉపాధ్యాయుల్ని సత్కరించారు. బివిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిధిలోని ఈశ్వ రయ్య కాలనీ మోడల్ ప్రాథమిక పాఠశాలలో విద్యా రంగానికి మహిళా ఉపాధ్యాయులు అందించిన సేవ లను కొనియాడారు. ఉపాధ్యాయ బృందాలు, విద్యార్థుల సారధ్యంలో సన్మానం జరిపారు. బివి పురం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీతగౌడ్ మాట్లాడుతూ మహిళా ఉపాధ్యాయురాలు మండలంలో సత్ఫలితాలు సాధిస్తూ తల్లిదండ్రుల మన్ననలను అందుకుంటున్నారన్నారు. ఈకార్యక్రమాల్లో గోపిమోహన్, షకీరా, శేఖర్, వెంకట్,ఈశ్వరయ్యకాలని మోడల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పర్యవేక్షకులు రామచంద్రారెడ్డి కృషి అభినందనీయం



**చిత్తూరురూరల్, మార్చి 10 ప్రభాతవార్త:** విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీసేందుకు జిల్లా బాల భవన్ పర్యవేక్షకులు, డ్రాయింగ్‌మాస్టర్ కె రామచంద్రారెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని డివైఇవో ఇందిర కొనియాడారు. డ్రీమ్‌యంగ్ చిల్డ్రన్స్ ఆర్ట్ అకాడమి నిర్వహించిన జాతీయస్థాయి ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో రామచంద్రారెడ్డి పర్యవేక్షణలో చిత్తూరు ప్రభుత్వఉన్నత పాఠశాల విద్యార్థులు చిత్రించిన చిత్రాలకు ఒకరికి జాతీయస్థాయి బాల చిత్రకళా అవార్డు, బంగారుపతకాలు, సిల్వర్‌మెడల్స్ రావడం అభినందనీ య మన్నారు. కాగా ప్రభుత్వ ఉన్నతపాఠశాలకు చెందిన బాబు, సుపియాన్, సాజియా, దీపాలి, కుష్బు, మహ్మద్‌జువేరి, శ్రవంతి, అస్లాం,ఉదయ్‌కుమార్, దయానంద్, నవ్య, బిఎస్ కన్నన్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన షీమ నస్రీన్, యశ్వంత్, ఇంద్రకుమారి, అబుతాహైర్, బద్రీ, హర్షద్, ఇర్ఫాన్, నూర్‌ఫాతిమా, అఫ్రీన్, ఆయిషా, పిసిఆర్ ఉన్నతపాఠశాలకు చెందిన పవన్‌కుమార్, యువన్‌సూర్యలకు బంగారు, వెండిపతకాలను అందజేసారు. అలాగే విద్యార్థులను ప్రోత్సహించిన తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను అభినందించారు.

## అనుమానాస్పద స్థితిలో యువతి మృతి



**వి.కోట, మార్చి 10 ప్రభాతవార్త:** వి.కోట మండలం బిసి పల్లెకు చెందిన సోమశేఖర్ కుమార్తె వైష్ణవి 20 అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. రెండు రోజులుగా వాంతులు విరేచనాలు అవుతుండటంతో నీరసించిన ఆమెను కుటుంబ సభ్యులు సోమవారం అర్ధరాత్రి 108 వాహనంలో వి.కోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ఆమెకు చికిత్స అందిస్తుండగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.బిడ్డ మృతితో తల్లిదండ్రులు శోక సంద్రంలో మునిగిపోయారు. మూడేళ్ల క్రితం చింతలగుంటకు చెందిన శివ తో ఆమెకు ప్రేమ వివాహమైంది.వీరికి ఏడాదిన్నర కుమారుడు ఉన్నాడు.ఆమె మృతి పట్ల అనుమానం వ్యక్తం చేస్తూ వైద్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

## 36 లక్షల నిధులతో సిసి రోడ్డు నిర్మాణం



**రామకుప్పం, మార్చి 10 ప్రభాతవార్త** మండలంలోని కవ్వంపల్లి గ్రామంలో సిసి రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం 36 లక్షలు నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తెలిపారు. మంగళవారం కూటమి నేతలు సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసి ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడునేతృత్వంలో రామకుప్పం మండలంలో వివిధ అభివృద్ధి పనుల్లో ముందుకు తీసుకెళ్తందన్నారు. ఈకార్యక్రమంలోమునస్వామి,నారాయణ చారి, మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ ఆనంద రెడ్డి, కార్యదర్శి కామరాజు నాయక్, నేతలు రామ్మూర్తి, గంట్లప్ప గౌడు,గుర్రప్ప, వెంకట్రామ గౌడు,కృష్ణనాయక్, మహమ్మద్ రఫీ, రవి రెడ్డి, జయశంకర్, విశ్వనాథ్, శ్రీనివాసులు గౌడు పాల్గొన్నారు.

## పోసంవారిపల్లి సోషల్ మీడియా సెక్రటరీగా యుగేంధర్

**పులిచెర్ల, మార్చి 10 ప్రభాతవార్త** మండలంలోని పోసంవారిపల్లి గ్రామ సోషల్ మీడియా సెక్రటరీగా యుగేంధర్‌ను నియమించడం పట్ల వైసిపి నాయకుడు రుకేష్ పేర్కొన్నారు. తన తుమ్ముడైన యుగంధర్‌ను నియమించినందుకు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, పుంగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిధున్ రెడ్డికి, వల్లివేడు రాజా రెడ్డికి, జయచంద్రారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

## లక్ష్మినారాయణ కాలనీలో ఇళ్ల పట్టాలను అమ్ముకున్నారు



**రొంపిచెర్ల, మార్చి10, ప్రభాతవార్త:** రొంపిచెర్ల గ్రామపంచాయతీలోని లక్ష్మినారాయణ కాలనీలో ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇళ్ల పట్టాలను కొందరు అమ్ముకున్నారని మండల టీడీపీ నాయకుడు దొరబాబు నాయుడు జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఆయన మంగళవారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పేదలకు గత టీడీపీ, వైఎస్సార్సీపీ ప్రభుత్వ పాలనలో సర్వే నెంబరు 1605/1, 1606/2లో సుమారు 172 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారని తెలిపారు. అయితే ఇళ్ల పట్టాల పంపిణీలో స్థానిక ప్రజాప్రతినిధులు సుమారు 100 ఇళ్ల పట్టాలను కాజేసి, ఇతరులకు అమ్ముకున్నారని ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు 20 నెలల కాలంలో ఐదు సార్లు ఫిర్యాదు చేశామన్నారు. ప్రజాప్రతినిధులు ఇళ్ల పట్టాల స్థానంలో కార్డులలో అడ్రస్‌లు వ్రాసి పేదలకు ఇచ్చి భారీగా నిధులు వసూలు చేశారని తెలిపారు. గతంలో వైఎస్సార్సీపీ ప్రభుత్వంలో చక్రం తిప్పిన ప్రజాప్రతినిధి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా టీడీపీ లోకి వచ్చి తన ఆస్తులను కాపాడుకుంటున్నారని ఆరోపించారు. నా భార్య పేరుతో ఇచ్చినటువంటి ఇంటి పట్టాను కూడా విక్రయించారని చెప్పారు. ఇళ్ల పట్టాల దుర్వినియోగం పై ఇన్‌చార్జి తహసీల్దార్ కిరణ్ కుమార్‌కు కూడా ఫిర్యాదు చేసిన ఎలాంటి లాభం లేదన్నారు. జిల్లా కలెక్టర్ సమగ్రంగా విచారణ జరిపితే వాస్తవాలు బయటికి వస్తాయని అన్నారు.

## ఘనంగా సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి

**రొంపిచెర్ల, మార్చి 10, ప్రభాతవార్త** ఆసరా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, మహిళా విద్యకు పునాది వేసిన మహనీయురాలు సావిత్రి బాయ్ పూలే 129వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యావేత్త డాక్టర్ టి. రఘునాథ్ మాట్లాడుతూ దేశ అభివృద్ధికి మహిళా విద్య అత్యంత కీలకమని అన్నారు. సమాజంలో మూఢనమ్మకాలు ఎక్కువగా ఉన్న కాలంలో మహిళలు చదవకూడదనే అభిప్రాయాలను ఎదుర్కొంటూ స్త్రీలకు విద్య అందించేందుకు సావిత్రి బాయ్ పూలే అహర్నిశలు కృషి చేశారని చెప్పారు. ఆమెకు సంఘ సంస్కర్త జ్యోతి రావ్ పూలే ఇచ్చిన ప్రోత్సాహంతో ఉపాధ్యాయురాలిగా ఎదిగి మహిళా విద్యకు నాంది పలికారన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే దంపతులు చేసిన సేవలు అపారమని తెలిపారు. మహిళల విద్యాభివృద్ధి కోసం అప్పట్లోనే 52 పాఠశాలలను స్థాపించి వసతి సౌకర్యాలు కల్పించడం గొప్ప విషయమన్నారు. సావిత్రిబాయి గొప్ప ఉపాధ్యాయురాలు మాత్రమే కాకుండా సామాజిక సంస్కర్తగా, రచయిత్రిగా కూడా పేరుపొందారని, రచించిన పావన కాశి, శుభోద రత్న వంటి కవితా సంపుటాలు సాహిత్య రంగంలో ప్రత్యేక స్థానం సంపాదించాయన్నారు. ఈ కార్యక్రమంలో దూదేకుల సంఘం జిల్లా అధ్యక్షుడు నూరేషా, బర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి వి. సుధాకర్ రెడ్డి, శ్రీనివాస ఫోటో స్టూడియో మల్లేపల్లి వెంకటేష్, ఆసరా సభ్యులు ఎన్. ఓబులేసు, యువ రైతు వి. హరినాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 14 లోపు బాలికలకు తప్పనిసరిగా హెచ్‌పివి వ్యాక్సిన్‌ను వేయించాలి

**తవణంపల్లె, మార్చి 10 ప్రభాతవార్త:** మండలంలోని 14 ఏళ్ళు లోపు బాలికలందరికి గర్భాశయ క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవి(హ్యూమన్ పాపిల్లోమ వ్యాక్సిన్)ను తప్పనిసరిగా వేచించాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ సుధారాణి అన్నారు. మంగళవారం ఆమె తవణంపల్లె పీహెచ్‌సీన సందర్శించారు. ఈసందర్భంగా మండలంలోని 14 ఏళ్ళు బాలికలకు హెచ్‌పివి వ్యాక్సిన్ కార్యక్రమంను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మండలంలోని 14 ఏళ్ళు లోపు బాలికలందరికి గర్భాశయ క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవి(హ్యూమన్ పాపిల్లోమ వ్యాక్సిన్)ను తప్పనిసరిగా వేచించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన్‌వేలు, డాక్టర్ షి.ప్రవీణ, సీహెచ్ఓ జ్ఞానశేఖర్, పీహెచ్ఎన్ జీవకళ, హెల్త్ సూపర్‌వైజర్లు గోపి,రాజశేఖర్, రెడ్డెమ్మ, ఆరోగ్య కార్యకర్త సుబ్రమణ్యంరెడ్డిలతో పాటు ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంట్లోనూ ఓ మహిళా పారిశ్రామిక వేత్త ఉండాలి



**పలమనేరు, మార్చి 10, ప్రభాతవార్త:** మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా రాణించాలని ఇందులో భాగంగా ప్రతి ఇంట్లోనూ ఓ మహిళా పారిశ్రామిక వేత్త ఉండాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పిలుపునిచ్చారు. ప్రపంచ మహిళా దినోత్సవం పలమనేరులో మంగళవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద భారీ సైజు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీలునిబట్టి ఈ నెలాఖరు వరకు మహిళా దినోత్సవం జరుపుకోవచ్చని తెలిపారు. మహిళా పారిశ్రామిక వేత్త వల్ల ఈ ఇల్లు ఆర్థికంగా ఎంతోఅభివృద్ధి చెందుతుందన్నారు.మహిళలకు ఇ సైకిళ్ళు పంపిణీ చేశారు. మున్సిపల్ కమీషనర్ ఎంవి రమణారెడ్డి, సూపర్‌బజార్ అధ్యక్షుడు ఆర్‌వి బాలాజీ పలువురు తెలుగుదేశం నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## బ్యాంకుల నుండే సైబర్ క్రైమ్ ప్రారంభం



**పలమనేరు, మార్చి 10, ప్రభాతవార్త:** బ్యాంకుల నుండే సైబర్ క్రైమ్ ప్రారంభమౌతోందని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిఐ గుణరామ్ అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక పోలీస్‌కు విచ్చేసిన ఆయన బ్యాంకుల ఖాతాదారులతో మాట్లాడుతూ ఈ రోజుల్లో డిజిటల్ అరెస్టు అనేది విపరీతంగా జరుగుతోందని తెలిపారు. ఈ అరెస్టులు జరగడానికి కేంద్ర బిందువు బ్యాంకులేనని ఏ బ్యాంకు కూడా ఇందుకు అతీతం కాదని అన్ని బ్యాంకుల పాత్ర ఇందులో వుందన్నారు. నేరం అనేది ఖచ్చితంగా బ్యాంకుల నుండే జరుగుతున్నాయని వివరించారు. నేరం ఎలా జరుగుతుందనే దానిపై అందరికీ అవగాహన ఉండాలని తెలిపారు. మన రాష్ట్రంలో ఈ ఏడాది జనవరి నుండి ఇప్పటి వరకు సుమారు 800 కోట్ల వరకు సైబర్ నేరాల ద్వారా డబ్బులు పోయాయని తెలిపారు. దేశంలో అన్ని బ్యాంకులు ఇంటర్‌నెట్ సౌకర్యం ఏర్పాటు చేసి ఎటిఎంల ద్వారా డబ్బులు అందజేయడం సంతోషదాయకమన్నారు. ఇలాంటి సైబర్ నేరాల పట్ల అ ప్రమత్తంగా వుండాలని అనుమానం వచ్చినపుడు వచ్చిన కాల్ నెంబరుతో సహా వెంటనే దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.

# దొరవారి సత్రం మండలంలో మట్టి మాఫియా!

**- 20 టిప్పర్లతో గ్రావెల్ తరలింపు -ప్రభుత్వ భూములు చెరువులు స్థలాల్లో తవ్వకాలు**
**- కన్నీటి చూడని అధికారి యంత్రాంగం**





దొరవారిసత్రం, మార్చి 10 ప్రభాతవార్త : మండలంలో మట్టి మాఫియా చెదరేగిపోతుంది. అధికార పార్టీ నాయకులు యథేచ్ఛగా మట్టి కొల్లగొట్టి కోట్లు గడిస్తున్నారు. వీళ్ళ టార్గెట్ చెరువులు పోరంబోకు భూములు ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ మట్టి ఇతర ప్రాంతాలకు రవాణా సాగిస్తున్నారు. పేదవాడు పిడికెడు మట్టి ఎత్తాలంటే సవాలక్ష షరతులు. దొరవారిసత్రం మండలంలోని నెల్లూరుపల్లి చెరువు పొరంబోకులో ఫారెస్ట్ సరిహద్దు ప్రాంతంలో భారీ యంత్రాలు సుమారు 20 టిప్పర్లతో ప్రక్క మండలాలకు అక్రమ గ్రావెల్ మట్టి తరల పోతుంది. చెరువులను కాపాడాల్సిన ఇరిగేషన్ అధికారులు రెవిన్యూ అధికారులు కన్నెత్తి చూడడం లేదని ఆ గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో టిప్ప ర్లను అడ్డుకుని, అధికారులకు సమాచారం అందించిన చూసి చూడనట్టుగా వ్యవహరించడం ఏమిటని గ్రామాల్లోని ప్రజలు తీవ్ర వ్యతిరేకత తెలుపుతున్నారు. అంతే కాకుండా అధికారులు మామూళ్ళ మత్తులో నిద్రపోతున్నారని అంతా వారి కనుసన్న లోనే మట్టి మాఫియా గ్రావెల్ దందా సాగుతున్నాయని అడ్డుకట్టయ్యాల్సిన అధికారులే నిమ్మకు నీరు ఎత్తినట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు అంటున్నారు. చెరువులకు చెరువులు కబ్జాలకు గురవుతున్న ప్రభుత్వ భూములు కబ్జాదారుల కనుసైగల్లో ఈ మండలం అధికారులు ఉన్నారని ప్రజల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇకనైనా జిల్లా అధికారులు స్పందించి ప్రభుత్వ భూములను చెరువులను కాపాడాలని మండలంలోని ప్రజలు కోరుతున్నారు.

## పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి : కమిషనర్




వెంకటగిరి, మార్చి 10 ప్రభాతవార్త: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు అందరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ కిరణ్ తెలిపారు. మునిసిపాలిటీ పరిధిలో స్వచ్ఛ సర్వేక్షణ సర్వేకు సంబంధించిన ఒకరోజు సామర్థ్య వికాస శిక్షణ కార్యక్రమం స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ విడుదల చేసిన మార్గదర్శకాలు మరియు సూచనల మేరకు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వీధుల్లో చెత్తావేదారం వైరాదని తెలిపారు. పట్టణం పరిశుభ్రంగా ఉంటే అంటువ్యాధులు రావని తెలిపారు. వీధుల్లోకి మురుగునీరు విడుదల చేయరాదని తెలిపారు. ఈ కార్యక్రమానికి నాలెడ్జ్ పార్ట్‌నర్‌గా ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ వ్యవహరించి శిక్షణ అందించింది. ఈ శిక్షణ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ తిరుపతి రావు, జయ మాధురిమ, పాల్గొని, స్వచ్ఛ సర్వేక్షణ లక్ష్యాలు, అమలు విధానం, ఫీల్డ్ స్థాయి డేటా సేకరణ, పౌర భాగస్వామ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, శుభ్రత ప్రమాణాలు మరియు సర్వేలో అనుసరించాల్సిన విధానాలపై సమగ్రంగా వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి సచివాలయం ఉద్యోగులు, వార్డ్ సెక్రటరీలు, మెప్మా ఆర్పీలు మరియు ఇతర మున్సిపల్ సిబ్బంది హాజరై శిక్షణ పొందారు. మేనేజర్ ఎన్.సాంబ శివయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎ రామారావు, సీఎంఎం దుర్గేష్ కుమార్ మాట్లాడుతూ పట్టణ పరిశుభ్రత, ప్రజల భాగ స్వామ్యం, వ్యర్థాల వేరు చేయడం, ఆరోగ్య పరిరక్షణ అంశాలలో సిబ్బంది చురుకుగా పనిచేయాలని సూచించారు.

## దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు : తహసిల్దార్



వాకాడు, మార్చి 10 ప్రభాతవార్త: దళారులు మాటలు నమ్మి రైతులు మోసపోవద్దని, ప్రభుత్వం ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్ తెలిపారు. మంగళవారం వాకాడు మండలం నెల్లిపూడి రైతు సేవా కేంద్రం నందు ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని రైతులు ధాన్యం కొనుగోలలో దళారులు చేతివాటం చూపిస్తారన్నారు, మాటలు విని రైతుల మోసపోవద్దని సూచించారు. ఏవో దీప మాట్లాడుతూ మండలంలోని వాకాడు, నెల్లిపూడి, దుగ్గరాజుపట్నం, నిడిగుర్తిలో ఉన్న రైతు సేవా కేంద్రాలలో క్లస్టర్‌గా ఏర్పాటు చేశామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు సద్వినియోగం చేసుకోవాలని, 17 శాతం అంత కంటే తక్కువ తేమ శాతం వరి ధాన్యాన్ని క్వింటా 2389, ఒక పుట్టి ధర 20306 రూపాయలు కొనుగోలు కేంద్రాల ద్వారా చెల్లించడం జరుగుతుందన్నారు. ఈ క్రాప్‌లో నమోదైన రైతులు డేటా పిపిసి లాగిన్‌లోకి రావడం జరుగుతుందన్నారు. షెడ్యూల్ ఇచ్చిన తర్వాత వాకాడు ఎం ఈ ఎస్ ద్వారా తేమశాతం ట్రాక్ షీట్ (లోడింగ్) మిల్లర్ ట్యాపింగ్ జరుగుతుందన్నారు. రైతులు అమ్మిన 48 గంటల్లోనే రైతులు ఖాతాలో అమోంట్ క్రెడిట్ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రభు కిరణ్ తదితరులు ఉన్నారు.

# కలసికట్టు కృషితోనే చిత్తూరు అభివృద్ధి

**- ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు**



చిత్తూరు, మార్చి 10 ప్రభాతవార్త: కలసికట్టుగా కృషి చేస్తేనే చిత్తూరు నగరం అగ్రగామిగా అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం లోని సమావేశహాలులో మంగళవారం మేయర్ అముద అధ్యక్షతన మున్సిపల్‌కార్పొరేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు మాట్లాడుతూ చిత్తూరు నగర అభివృద్ధి కోసం కలసివచ్చే ప్రతి ఒక్కరిని కలుపుకుని ముందడుగు వేస్తామన్నారు. చిత్తూరు నగర అభివృద్ధి కోసం తనతో కలసి వచ్చిన మేయర్ అముద, డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ కార్పొరేటర్లను ఆయన అభినందించారు. ఎవరు ఏ పార్టీలో వున్నప్పటికీ ప్రజల కష్టాలకు స్పందించి విధులు నిర్వర్తించి ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. చిత్తూరు ప్రజలు ఇచ్చిన అవకాశంను సద్వినియోగం చేసుకుని మంచి పనులు చేయడానికి ఐదేళ్ళు శ్రమించిన వారికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. మరో వారం రోజుల్లో ప్రస్తుత మున్సిపల్ పాలకవర్గ పదవికాలం ముగియడంతో పార్టీలకతీతంగా ఆత్మీయ సమావేశం నిర్వహించి సరికొత్త సంప్రదాయంకు నాంది పలుకుతున్నామన్నారు. మేయర్ అముద మాట్లాడుతూ గత ఐదేళ్ళ కాలంలో నగర అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశామని, దీనికి సహకారం అందించిన ఎమ్మెల్యేలు, డిప్యూటీ మేయర్లు, సభ్యులకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమీషనర్ ఎ.ప్రసాద్, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్లు ఆర్.చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డిలు, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

**2026-27 బడ్జెట్ అంచనాలకు ఆమోదం:** మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ సమావేశభవనంలో మంగళవారం మేయర్ అముద అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో 2026-27 బడ్జెట్ అంచనాలను ఆమోదించింది. మంగళవారం జరిగిన బడ్జెట్ కౌన్సిల్ సమావేశంలో చిత్తూరు నగర పాలక సంస్థకు చెందిన సాధారణ నిధులు, ప్రభుత్వ గ్రాంట్లకు సంబంధించి 2025-26 సంవత్సరపు సవరించిన బడ్జెట్ అంచనాలను అలాగే 2026-27 సంవత్సరం బడ్జెట్ అంచనాలను సమావేశం ఆమోదించింది.

**మేయర్, చుడా ఛైర్‌పర్సన్, డిప్యూటీ మేయర్లకు ఘన సత్కారం:** మున్సిపల్ కార్పొరేషన్ సభ్యుల పదవికాలం ముగియనుండటంతో మంగళవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్లు ఆర్.చంద్రశేఖర్, రాజేష్‌కుమార్ రెడ్డిలను ఘనంగా సత్కరించారు. అలాగే కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులకు శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర, మున్సిపల్ ఇంజనీర్ వెంకటరామిరెడ్డి, మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ సేవలను తెలుగుజాతి మరువదు

**- ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్**
**- రామకుప్పంలో ఎన్టీఆర్ విగ్రహంకు భూమిపూజ**



రామకుప్పం, మార్చి 10 ప్రభాతవార్త: దివంగత సిఎం ఎన్టీఆర్ సేవలను తెలుగు జాతి ఎన్నటికీ మరువదని ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. రామకుప్పంలో దివంగత ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుకు గాను స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఎన్టీఆర్ సంక్షేమ పథకాలతో పేదలకు సేవ చేశారన్నారు. అదే బాటలో సిఎం చంద్రబాబునాయుడు నడుస్తూ ముందుకుసాగుతున్నారన్నారు. రామకుప్పంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటుచేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టిటిడి డైరెక్టర్ వైద్యం శాంతారాం, ఎపిఐఐసి డైరెక్టర్ ప్రేమ్‌కుమార్, నేతలు మునస్వామి, పట్రనారాయణ, వెంకటరమణ, ఆనందరెడ్డి, రామూర్తి, చిన్నికృష్ణ, చలపతి, గంట్లప్పగౌడు, కామరాజునాయక్, గుర్రప్ప, వెంకటరామగౌడు, కృష్ణానాయక్, విశ్వనాథ్, రఫీ, రవిరెడ్డి, జయశ ంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సైనిక్ భవన్ నిర్మాణ స్థలంను పరిశీలించిన డైరెక్టర్



చిత్తూరు, మార్చి 10 ప్రభాతవార్త: చిత్తూరులో సైనిక్ భవన్ నిర్మాణం కోసం కేటాయించిన 5 సెంట్ల స్థలంను మంగళవారం ఎపి సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ క్యాప్టెన్ సత్యప్రసాద్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ ఎం.బాలాజీలు పరిశీలించారు. ఎపి సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ క్యాప్టెన్ సత్యప్రసాద్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ ఎం.బాలాజీలు జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ రాఘవులుతో కలిసి చిత్తూరులోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా మాజీ సైనికుల సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన వార్ మెమోరియల్ కోసం రూ.2.72 లక్షలను సహాయంగా అందజేశారు. ఎపి సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ సైనిక్ భవన్ నిర్మాణంపై ఎపిఇడబ్ల్యుడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌తో ఎపి సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ చర్చించారు. అనంతరం కార్యాలయంలోని పలు ఫైళ్ళను తనిఖీ చేశారు. కొత్త సైనిక్ వెల్ఫేర్ భవన్‌ను జడ్పీ కార్యాలయం ఎదుట నిర్మించాలని ప్రతిపాదన చేశారు. అనంతరం జిల్లా సైనిక్ వెల్ఫేర్ కార్యాలయంలో మాజీ సైనికులతో ఎపి సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ కెప్టెన్ సత్యప్రసాద్ సమావేశమయ్యారు. అనంతరం మాజీ సైనిక సంక్షేమ సంఘ నాయకులు ఎపి సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ కెప్టెన్ సత్యప్రసాద్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ ఎం.బాలాజీలను సన్మానించారు.

## బీర పంటను నెలమట్టం చేసిన ఆకతాయిలు



బైరెడ్డిపల్లి మార్చ్ 10 ప్రభాతవార్త: బైరెడ్డిపల్లి మండలంలో జరిగిన ఘటన రైతన్నలను తీవ్ర ఆవేదనకు గురి చేస్తున్నది. కోతకొచ్చిన పంటను ఆకతాయిలు నెల మట్టం చేశారు. మండలం లోని వీకోటకు వెళ్లే జాతీయ రహదారిలో నూతనంగా నిర్మిస్తున్న పెట్రోల్ బంక్ పక్కన సుబ్రమణ్యం అనే రైతన్న 2 ఎకరాలు బీర సాగు చేశారు. సుమారు రూ. 3 లక్షలు ఖర్చు పెట్టి, స్టేకింగ్ పద్ధతిలో పందేరు వేసి సాగు చేస్తే సోమవారం ఉదయం పట్టపగలే 9.00 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని దుండగులు పంటను నేల మట్టం చేశారు. ఈ సందర్భంగా రైతన్న మాట్లాడుతూ పచ్చి మిర్చి కోతలో కుటుంబీకులు, కూలీలు నిమ్నగ్న కాగా ఎవ్వరు లేని సమయం చూసి గుర్తు తెలియని కేటుగాళ్ళు 2 ఎకరాల బీర సాగును నెల మట్టం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్లో ధరలు పుంజుకొంటున్న సమయంలో ఎవ్వరో గిట్టని వారు ఈ దుర్మారకపు పనికి వడిగట్టారని తెలుపారు. ఇది ఒక దుర్మారకపు చర్యని పలువురు ఖండిస్తున్నారు.

## ప్రోటోకాల్ విస్మరించిన అధికారులపై ఎంపిపి అగ్రహం



తిరుపతిరూరల్, మార్చి 10 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలంలో అధికారులు ప్రోటోకాల్ పాటించకుండా సమావేశాలు నిర్వహిస్తున్న తీరుపై మండలాధ్యక్షుడు విడుదల మాధవరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులను ఎవర్ని బెదిరించలేదని, కేవలం ప్రజా సమస్యలు పరిష్కరిం చాలని మాత్రమే కోరామని స్పష్టం చేశారు. మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించాలని పలుమార్లు ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపిడిఒను కోరిన పట్టించుకోలేదని, స్వయాన పంచాయతీ రాజ్ కమీషనర్‌కు లేటర్ పెట్టడంతో మండల సమావేశం నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. మహిళ దినోత్సవ రోజున స్థానిక మహిళా ప్రజాప్రతినిధులను సన్మానించినట్లు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సర్పంచ్‌లు, ఎంపిటిసిలకు సమాచారం ఇవ్వకుండా సమావేశాలు నిర్వహించడం ప్రజాస్వామ్య విరుద్ధమని పేర్కొన్నారు. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులు పంచాయతీ తీర్మానం ఆధారంగా మాత్రమే చేయాలని, ప్రజాప్రతినిధులను పక్కన పెట్టి నిర్ణయాలు తీసుకోవడం సరైందని కాదని స్పష్టం చేశారు. గాంధీపురం గ్రామ పంచాయతీలో కూటమి నాయకుల అరచకాలు ఎక్కువైనాయని గ్రామ సర్పంచ్ లక్ష్మీశివ ఆరోపించారు. అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఫ్లెక్సిలు ఏర్పాటు చేయడం బాధాకరమని గాంధీపురం ఎంపిటిసి జైకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సర్పంచ్‌లు దామినేటి కేశవులు, చిన్ని యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యవర్తిత్వంతో పెండింగ్ కేసుల పరిష్కారం సాధ్యం

తిరుపతి, మార్చి 10 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా కోర్టు ఆవరణలో మంగళవారం ఉదయం న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయసేవల సాధికార సంస్థ మెంబరు సెక్రటరీ బీఎస్‌వీ హిమబిందు ఆదేశాల మేరకు ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఢిల్లీకి చెందిన సీనియర్ న్యాయవాది అనూజ సక్సేనా హాజరై మాట్లాడుతూ కోర్టులల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వం ద్వారా కోర్టు వెలుపల సామరస్యంగా పరిష్కరించేందుకు న్యాయవాదులు కృషి చేయాలని ఆమె సూచించారు. మధ్యవర్తిత్వం, సయోధ్య ప్రాజెక్టు కమిటీ భారత సుప్రీం కోర్టు పర్యవేక్షణలోపని చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఎం.ఎస్.భారతి(సివిల్ జడ్జి-డివిజన్) మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ 1987 నుంచి నిరుపేదలకు ఉచిత న్యాయ సేవలను అందిస్తూ, లోక్ అదాలత్ ద్వారా వివాదాల పరిష్కారానికి కృషి చేస్తోందని తెలిపారు. తిరుపతి జిల్లా న్యాయమూర్తి జి.అర్చన మాట్లాడుతూ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వం ద్వారా సామరస్యంగా పరిష్కరించుకోవడం అవసరమని అన్నారు.

## వసతి గృహంలో మహిళా దినోత్సవం



తిరుపతి హెల్త్, మార్చి 10 ప్రభాతవార్త: ఎస్వీ వైద్య కళాశాల మహిళా వసతి గృహంలో మహిళా దినోత్సవంను ఎస్వీ వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రవి ప్రభు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళా దినోత్సవం సందర్భంగా వైద్య విద్యార్థినులు అందరికి శుభాకాంక్షలు తెలిపారు. మహిళలు ప్రతి రంగంలో ముందడుగు వేస్తూ ప్రగతి పథంలో నడుస్తున్నారని ఆయన తెలిపారు. మహిళలు అన్నిరంగంలో ముందడుగు వేస్తూ వారి కుటుంబాన్ని, ఇటు ప్రజలకు, రోగులకు, మెరుగైన వైద్యం అందిస్తూ, ఉత్తమమైన వైద్య విద్యను నేర్పిస్తూ, మహిళా వైద్యులను తయారు చేయడంలో వారి పాత్ర ఎంతో ముఖ్యమైనదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ వి వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, మహిళా వసతి గృహ వార్డెన్ డాక్టర్ రోజా రమణి, యూజీ వైద్య విద్యార్థులు తదుతరులు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలే వర్ధంతి వేడుకలు



తిరుపతి, మార్చి 10ప్రభాతవార్త: సావిత్రిబాయి పూలే వర్ధంతిని తిరుపతి లో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆమె విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యుడు గుండాల గోపీనాథ్ రెడ్డి, బిజెపి రాష్ట్ర ఓబీసీ మోర్చా మాజీ ఉపాధ్యక్షుడు కట్టమంచి చంద్రబాబు యాదవ్, సుబ్రహ్మణ్యం యాదవ్ దేశానికి గొప్ప సేవలు చేసిన సావిత్రిబాయి పూలేను ప్రతి భారతీయుడు స్మరించుకోవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో, లోక ప్రభాకర్ నాయుడు, దీపక్ యాదవ్, సవిత, జనార్ధన్ రెడ్డి ,మల్లారపు రవిప్రసాద్, రామ్ కుమార్, ఎల్ కృష్ణయ్య గంధం వెంకట ముని, పురోహితుడు సురేష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## టిడ్కో ఇళ్లను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి



నాయుడుపేట, మార్చి 10 ప్రభాతవార్త : ఈ నెల 17వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు తిరుపతి జిల్లా నాయుడుపేట నియోజకవర్గంలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం సాయంత్రం నాయుడుపేట మండలంలోని టిడ్కో ఇళ్ల ప్రాంతాలను స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు తదితరులతో కలిసి ముఖ్యమంత్రి పర్యటించనున్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 17న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయుడుపేటలో నిర్మించిన టిడ్కో ఇళ్లను ప్రారంభించేందుకు రానున్నారని తెలిపారు. అందులో భాగంగా ఈ రోజు హెలిప్యాడ్, సభా స్థలాలను పరిశీలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు శానిటేషన్, మొక్కలు నాటడం, విద్యుత్, ఆర్ అండ్ బి, ఇతర సంబంధిత శాఖల సమన్వయంతో ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమంపై చర్యలు చేపట్టాలి : ఎంపీ



వెంకటగిరి, మార్చి 10 ప్రభాతవార్త: వ్యవసాయం, రైతుల సంక్షేమానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో పంటల ఉత్పాదకత పెంపు అంశంపై తిరుపతి పార్లమెంట్ సభ్యులు మద్దిల గురుమూర్తి లోక్‌సభలో ప్రశ్నించారు. వరి వంటి ప్రధాన పంటల దిగుబడులు జాతీయ సగటుతో పోలిస్తే తక్కువగా ఉన్న నేపథ్యంలో రాష్ట్రానికి ప్రత్యేక పంట ఉత్పాదకత వ్యూహం రూపొందించిందా అని కేంద్రాన్ని అడిగారు. అలాగే జిల్లాల వారీగా దిగుబడి లోటుపాట్లపై అంచనాలు చేసి వాటిని రాష్ట్ర ప్రభుత్వంతో పంచుకున్నారా, సూక్ష్మ సాగు విధానాలు, మెరుగైన విత్తనాల వినియోగం, వ్యవసాయ సలహా సేవలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల అనుసంధానం వంటి చర్యలు తీసుకుంటున్నారా అని వివరాలు కోరారు. ఈ ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి భగీరథ్ చౌదరి సమాధానం ఇచ్చారు.

## సావిత్రిబాయ్ పూలే వర్ధంతి వేడుకలు

నాయుడుపేట, మార్చి 10 ప్రభాతవార్త: భారతదేశ మొట్టమొదటి ఉపాధ్యాయు రాలు సావిత్రిబాయి పూలే 129వ వర్ధంతి వేడుకలను తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలో మంగళవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూళ్లూరుపేట నియోజకవర్గం బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు జువ్వలపాటి మస్తాన్, నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వినుకొండ ధనంజయ, వి.శివ. దూదాకుల సంఘం అధ్యక్షులు సులేమాన్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు సమ్మాయిపాలెం రామయ్య, వినుకొండ, ఆవుల వినోద్, టి శేఖర్, ఎ రాము, వెంకటేశ్వర్లు, బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీహరికోటలో సిఐఎస్ఎఫ్ 57వ వ్యవస్థాపక దినోత్సవం




సూళ్లూరుపేట, మార్చి 10 ప్రభాతవార్త: సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోటలో సిఐఎస్ఎఫ్ 57వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. షార్‌లోని సిఐఎస్ఎఫ్ యూనిట్ ఆధ్వర్యంలో కొత్తచేను బ్యారక్ పరేడ్ మైదానంలో ప్రత్యేకంగా రైజింగ్ పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షార్ డైరెక్టర్ ఇఎస్ పద్మకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సిఐఎస్ఎఫ్ పరేడ్ కమాండెంట్ ఇన్‌స్పెక్టర్ వీరేంద్రసింగ్ నేతృత్వంలో 6 ప్లాటూన్లు, మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం కమాండెంట్ సంజిత్‌కుమార్ మాట్లాడుతూ దేశంలోని కీలక పారిశ్రామిక సంస్థలు, విమానాశ్రయాలు, కోర్టులకు భద్రత కల్పించడంలో సిఐఎస్ఎఫ్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. వందేమాతరం, కోస్టల్ సైక్లోథాన్ 2026ను విజయవంతగా నిర్వహించడంలో విశేష సేవలందించిన సిఐఎస్ఎఫ్ సిబ్బంది షార్ డైరెక్టర్ పద్మకుమార్ అభినందించారు. అలాగే 2025వ సంవత్సరానికి షార్ సిఐఎస్ఎఫ్ యూనిట్ ఉత్తమ యూనిట్‌గా ట్రోఫీని అందుకోవడాన్ని ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ విక్రమ్ సింగ్, ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఎస్ఐలు వికాస్, మంజునాథ్ తదితరులకు ప్రతిభ పురస్కారాలు అందజేశారు.

## ముత్యాలమ్మ జాతరకు 10 ప్రత్యేక బస్సులు

సూళ్లూరుపేట, మార్చి 10 ప్రభాతవార్త: చిల్లకూరు మండలం తూర్పుకనుపూరు గ్రామంలో జరుగుతున్న ముత్యాలమ్మ జాతరను పురస్కరించుకుని సూళ్లూరుపేట ఆర్టీసీ డిపో నుంచి పది ఆర్టీసీ బస్సులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ కళ తెలిపారు. మంగళవారం ఈ బస్సులకు శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి దేవస్థానం వద్ద పూజలు నిర్వహించి అనంతరం కనుపూరుకు పంపారు. 10, 11, 12, 13 తేదీల్లో ఈ బస్సులు కనుపూరుకు వెళ్లే భక్తులకు అందుబాటులో ఉంటాయని డిపో మేనేజర్ కళ తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ సురేష్, నేషనల్ యూనిటీ సెక్రటరీ ఎం.శేఖర్, కరుణాకర్‌రెడ్డి, చెల్లయ్య, శీను, షబ్బీర్, శ్రీహరి, సుందరరాజులు పాల్గొన్నారు.

## వైయస్సార్సీపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



తడ,మార్చి 10 ప్రభాతవార్త : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావించి 15 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆదేశాల మేరకు తడ మండల వైసీపీ కన్వీనర్ కెలివి ఆర్ముగం ఆధ్వర్యంలో దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. రమేష్, చిన్నప్పన్ రమేష్, రాజ్ కుమార్, మనసామిరెడ్డి, కామిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, సుధాకర్, తిరుమల్‌రెడ్డి, రవి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు..

**విభిన్న ప్రతిభావంతుల,వయోవృద్ధులు**

## సహాయ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి-కమిషనర్



తిరుపతి,మార్చి 10ప్రభాతవార్త: సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ సౌజన్యంతో ఈ నెల 16వ తేదీ నిర్వహించనున్న విభిన్న ప్రతిభా వంతుల, వయోవృద్ధుల సహాయ పరికరాల గుర్తింపు శిబిరాలను సద్విని యోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య మంగళవారం తెలిపారు. కృత్రిమ అవయవాల తయారీ సంస్థకాన్పూర్ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ సోమవారం ఉదయం 8 గంటలనుండి మధ్యాహ్నం 3గంటల వరకు తుడా కార్యాలయం సమీపంలోని ఇందిరా మైదానం, గిరిజన భవన్‌నందు దివ్యాంగుల, వయోవృద్ధుల కొరకు సహాయ పరికరాల గుర్తింపు శిబిరాన్ని నిర్వహించనున్నారని తెలిపారు. చేతి కర్రలు, వాకర్లు, మూడు కాళ్ళ చేతి కర్రలు, నాలుగు కాళ్ళ చేతి కర్రలు, చంక కర్రలు, వీల్ చైర్లు (తోపుడు బండ్లు), చెవి వెనుక ధరించే వినికిడి యంత్రాలు, బ్యాటరీ ట్రై సైకిల్, మూడు చక్రాల సైకిళ్ళు, రోలేటర్స్, యం.ఎస్. కిట్స్, అంధుల చేతి వాచ్, అంధుల చేతి కర్రలు, వాయిస్ ఫోన్, ఎల్ బో క్రచస్, లెప్రసీ వ్యాధి నయమైన వ్యాధి గ్రస్తులకు కిట్లు, డైసీ ప్లేయర్స్, యం.యస్.ఐ.డి. కిట్స్, స్మార్ట్ కేన్, కృత్రిమ ఉపకరణాల కొరకు శిబిరం నిర్వహిస్తున్నారని తెలిపారు.

## ఆంగ్ల శాఖ విద్యార్థినులకు అభినందనలు

**-పద్మావతివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య ఉమ**



యూనివర్సిటీ(తిరుపతి),మార్చి 10ప్రభాతవార్త: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆంగ్ల శాఖకు చెందిన ఎం ఏ ఇంగ్లీష్ చదువుతున్న ద్వితీయ సంవత్సరం విద్యార్థినిల ప్రతిభను వర్సిటీ గుర్తించింది. విమెట్రీ/ మహిత్వం అనే ద్వి భాషా కవితాత్మక ప్రదర్శనను ఆసాంతం ఆకట్టుకునే విధంగా ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో పాత్రలు నారీ స్వరాలు. మొల్ల, వెంగమాంబ, మాయా యాంజలో, కవితా సిన్హా, జయప్రభ, విమల, శిలా లోలిత సావిత్రి, పార్వతి, అంజన లాంటి అనేక కవయిత్రుల స్వరాలు తెలుగు ఆంగ్ల భాషల్లో వినిపించి స్త్రీలకు సంబంధించిన అనేక విషయాలను వీరి కవితల ద్వారా ఎలా ప్రతిబింబించారో చూపుతూ వారి స్వరాలలోని బాధ, ధిక్కారము, శక్తి, ఉద్యమ స్ఫూర్తి 14 మంది విద్యార్థినులు చక్కగా ప్రదర్శించారు. ఇక వనజాయంగా సంగీత మందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి, ఉపకులపతి ఆచార్య ఉమ, డీన్ ఆచార్య సి. వాణి, అమెరికా నుంచి వచ్చిన యాంజిలా సూజన్, ఆంగ్ల శాఖ అధ్యాపకులు వివిధ శాఖలకు చెందిన విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొని కళాకారులను అభినందించారు.

**CHANGE OF SURNAME**
I, BHARATHI BOMINENI (Old Name), D.No: 6-6-208, Adarsha Colony, Anantapuramu Town & District, A.P. I have Changed My Surname From BHARATHI BOMINENI (old name) to **BOMMINENI BHARATHI** (New Name). Henceforth My Name Being as Called **BOMMINENI BHARATHI** W/o Challa Sreenivasulu For All Purposes.